# ఊసరవెల్లి

"అమరశ్రీ"

ఏడుస్తున్న పిల్లవాడివంక చూడాలనిపించిందెందుకో కేశవరావుకు పిల్లవాడిని జాగ్రత్తగా పరికించిచూడటమదే మొదటిసారి. మేళాలు, తాళాలూ అన్నీ జోరుగా మోగిపోతున్నయ్. పిల్లవాడివంక చూడాలనుకున్నాడు, కాని చూడవద్దనీ చూస్తే ఏదో తీరనిప్రమాదం తప్పక కలుగుతుందనీ వెనుకనుండి ఎవరో కేకలేస్తున్నట్లనిపించింది.

అసలీ పదిరోజులనుండి చూడటానికి అవకాశమెక్కడిది? ఆ పనులలో ఈ పనులలో మునిగిపోయి ఉండటంవల్ల పురిటిగదివైపుకైనా వెళ్ళటానికి వీలుచిక్కిందికాదు. ఎన్నో ఊహలతో ఊగిసలాడుతూన్న సమయంలో ఒక్కసారిగా కేశవరావుతల కమలచేతిలోఉన్న పిల్లవాడికేసి చూసింది.

పురోహితుడు ఏవో మంత్రాలు గుక్క తిప్పుకోకుండా వల్లించేస్తున్నాడు, కనీసం ఎవరైనా తన ప్రయాసమూస్తున్నారా అనేదికూడా ఆలోచించకుండానే కమలచేతులలో పొత్తిగుడ్డలలో, చిన్నగా అటూ ఇటూ కదులుతున్నాడు పిల్లవాడి ముఖం ఒకసారిచూచి వెంటనే కమల ముఖం వంక చూశాడు. కమలముఖం కళకళలాడుతోంది ఏ మాత్రం బాధగాని విచారంగాని ఆమె ముఖంలో లేవు.

పిల్లవాడు పుట్టాడనగానే ఎందుకోసమో, ఏమనుకొనో సంతోషించాడు కేశవరావు. కానిపిల్లవాడినిచూస్తుంటే ఎందుచేతనో ఆసంతోషమంతా అదృశ్యమౌతోంది జాగ్రత్తగా మరొకసారి పరిశీలించాడు పిల్లవాడిని- మరొకసారి కమలముఖం కేసి చూశాడు. కేశవరావుకు వళ్లుజలదరిస్తోంది.

అటువంటి పిల్లవాడికి తను భారసాలచేస్తున్నాడు. ఛా! తనకు నిజం తెలిసిఉండిగూడా ఎందుల కింత అసమర్ధుడిలా ప్రవర్తిస్తున్నాడు. మాధవరావు కోసం చుట్టుప్రక్కల కలయజూశాడు, కాని కనుపించలేదు.

ఆ పిల్లవాడు నిజంగా తనవాడు కాదు. ఆ విషయం కేశవరావుకు బాగాతెలుసు. అయితే పిల్లవాడు పుట్టగానే ఎందుకు సంతోషించాడు? అటువంటి తత్వాన్ని అలవరచుకోవా లనుకున్నాడు గాబట్టి. విశాలభావాలుగల తత్వాన్నే అలవరచుకోవా లనుకున్నాడుగాబట్టి. సామాన్య మానవుడిలా సంకుచితత్వంతో మగ్గిపోగూడదనుకున్నాడుగాబట్టి.

చిన్నప్పటినుండి మాధవరావుకూ తనభార్య కమలకూ సంబంధ మున్నదని కేశవరావుకు తెలుసు ఎందుకు వారి సంబంధాన్ని కేశవరావరి కట్టలేదు? దానికి కారణం అతనితత్వం. భార్యను కట్టుబాట్లలో ఉంచగూడదు కేశవరావు శాస్త్రంలో పరపురుషుడితో సంబంధమున్నా సహించితీరాలి. ఎందుచేతనంటే భార్యకదిఇష్టంగాబట్టి, ఎవరి యిష్టంవచ్చినట్లు వాళ్ళని వదిలెయ్యాలి గీట్లుగీచి ఆగీతలలోనే ఉండాలని నిర్దేశించటం కేశవరావు శాస్త్రరీత్యా ఇంక మహాపాపం. అందుచేతనే

కేశవరావు కమలనూ ఏమీ అనలేకపోయాడు. మాధవరావునూ మందలించలేదు. వాళ్ళ ఇష్ట మొచ్చినట్లు సంచరించనిచ్చాడు కాదుగూడు అని చెప్పటానికి తనెవ్వడు?

పిల్లవాడికేసి కన్నార్పకుండా చూస్తున్నాడు. మేళతాళాలు మరింత హుషారుగా మోగుతున్నాయ్. దారి తెన్నూ తెలియని ఒక మహాసముద్రంలో పడి కొట్టుకుపోతున్నట్లున్నది కేశవరావుకు ఆటువంటి కేశవరావు తత్వం ఇంతకు ముందొకసారి పరిస్థితులతో యుద్ధంచేసింది కాని గెలవలేకపోయింది.

తన పినతల్లి వ్యభిచరిస్తూంటే నిజంగా తన సిద్ధాంతరీత్యా అయితే తనుచూస్తూ ఊరుకోవాలి కాని లోకం కోడై కూసింది తనవెనుక గుసగుసలు బయలుదేరినై. కాని తను వాటినన్నిటిని లెక్కజేయకుండా తనదారిన తానుపోవాలి, తన పినతల్లిని ఏమీ అనకూడదు. కాని ఉండలేకపోయాడు అప్రతిష్ట; అవమానం ఇవన్నీ కేశవరావును పీక్కుతింటాయని బెదరించినయ్. తనకున్న "విలువ" అంతా సర్వనాశనం కాబోతున్నదనుకున్నాడు కేశవరావు. పైవాతావరణం అంతా అతనిని ప్రోత్సహించి పినతల్లిని కట్టుబాట్లలో ఉంచేలా చేసినయ్.

ఎంత ఊరుకోవాలనుకున్నా ఊరుకోలేకపోయాడు. తన పినతల్లిని అనుకోకుండానే అదుపాజ్ఞలలో పెట్టాడు తనతత్వం అది ఒకచేతగాని పని అని నొక్కిచెపుతున్నాకూడ తన జీవితందెబ్బతింటుందేమోనన్న స్వార్థంతో పినతల్లిని కట్టడిచేశాడు. జీవితంలో తన తత్వాన్నుపయోగించుకోలేకపోయాడు.

ఆపిల్లవాడిని చూస్తున్నకొద్దీ భార్య మీద కోపమూ, మాధవరావుమీద అసూయా పుట్టుకువస్తున్నయ్ ఈ రెండూ వెనుకటి విషయాన్ని త్రవ్వి కేశవరావుముందర పెట్టుతున్నది. మరొకసారి ఓడిపోతున్నావని ఎవరో వెనుకటి విషయాలను జ్ఞప్తికి దెస్తున్నట్లున్నది. కేశవరావుకు-భార్యనుగాని, మాధవరావునుగాని మందలించగూడదన్నభావం క్రమంగా కేశవరావునుండిపోతున్నది. దానికిబదులు వాళ్ళమీద కోపమూ ఈర్ష్యవస్తున్నయ్.

మాధవరావు ఎవరు? తన స్నేహితుడు మాత్రమే అటువంటి వాడికి తన భార్యమీద ఎంతమాత్రం హక్కుంది? నెమ్మదిగా హక్కుల రభసలోకి పోతున్నాడు కేశవరావు. నిజంగా తన తత్వప్రకారమైతే భర్తకుకూడ భార్యమీద హక్కులేదు. అంటే, కమలమీద తనకెంత హక్కున్నదో మాధవరావుకు కూడ అంతా ఉన్నది. కాని ఆభావాలు నెమ్మదిగా కేశవరావునుండి జారిపోతున్నయ్. సామాన్యమానవుడికుండే భావాలే కేశవరావునుకూడ నింపేయబోతున్నయ్.

కమల ఎందుకంత నీచపుపని కొడబడింది, తాను పినతల్లిని అదుగుతుంటే చూచికూడా అటువంటిపని చెయ్యగూడదని తెలుసునా. తను ద్వేషిస్తానని తెలుసుకొనికూడ అటువంటి తప్పుడుపని ఎందుకుచేసిందో అర్థం కావటంలేదు కేశవరావుకు. అయినా, అన్నిలక్షణాలున్న తన నొదిలి పారేసి మాధవరావును బెట్టుకొని ప్రేలాడట మెందుకు? తనలోలేని మంచిగుణాలు ఏమాత్రమున్నాయ్ మాధవరావులో. కేశవరావు శరీరం వేడెక్కుతోంది. కోపాన్ని పట్టలేకపోతున్నాడు కేశవరావు. కమల తలకాయబట్టుకొని గోడకేసి కొట్టాలనిపించేస్థితికి వచ్చాడు కేశవరావు-

సాంబ్రాణి కట్టెలపొగ, డోళ్ళమోత; పిల్లవాడి ఏడుపు, పురోహితుడిగోడు- వీటిమధ్య ఒక రాయిలా కూర్చుండిపోయాడు కేశవరావు. డోలుమీద ఒక్కొక్క దెబ్బపడుతూంటే కేశవరావు హృదయంమీద కొడుతూన్నట్లున్నది. అక్కడ కూర్చోలేక పోతున్నాడు. కమల జాకపిశాచంలా కనుపిస్తున్నది కేశవరావుకళ్ళకు. తనను తానే కంట్రోలుచేసుకోలేని స్థితిలోకి పోయాడు. అంత

ఆవేశంతో ప్రతికూల పరిస్థితులలో అణగిఉండే అగ్నిపర్వతంలా కూర్చున్నాడు.

ఈ విధంగా కనక కుతుకుతూ కూర్చుంటే అందరూ తననుచూచి ఏమనుకుంటారు? అసమర్థుడిక్రింద లెక్కకట్టేస్తారు పిల్లవాడిదగ్గరనుండి పెద్దవాడివరకు తనంటే లెక్కచెయ్యరు కనీసం పిఱికివాళ్ళుకూడ తనవెనుకవె కిలిసవ్వులు నవ్వుతుంటారు. ఇకముందు తనస్థితిని తనస్వయం శక్తితో చిత్రించుకొంటున్నాడు కేశవరావు.

ఫలితా లెలాఉన్నా మాధవరావు, కమల అంతు తేల్చుకోవాలనుకున్నాడు. ఏంచెయ్యాలో ఏ విధంగా కసితీర్చుకోవాలో అతనికేతెలియదు కాని పగతీర్చుకోవాలి కమలను శిక్షించాలి. మాధవరావుకు తగినప్రతీకారం చెయ్యాలి

ఆపిల్లవాడు తన కొడుకేనని ఏవిధంగా చెప్పుకొంటాడు తాను? ఒకవేళ తను చెప్పకుంటే మాత్రం అందరకూ తెలియదూ! మాధవరావు గూడ తననొక"వెధవ"క్రింద జమకట్టి ఉంటాడు

అభివృద్ధి జేసుకోవాలనుకున్న తత్వం ఇప్పుడతనిలో పూర్తిగానశించింది. అభావాలను ఏదో ఒకవిధంగా తెచ్చిపెట్టుకోవాలని ప్రయత్నించినా కూడ అట్టేఉపయోగం కనుపించలేదు. పిల్లవాడి వంక చూసినకొద్దీ అసూయ, కోపం తనను ముంచేస్తున్నయ్. కమలను చూస్తుంటే అగ్నిహోత్రంలో నెయ్యిపోస్తున్నట్లవుతోంది.

ఇంతలో మాధవరావొచ్చా డక్కడికి. మాధవరావులోకి చూడగనే ఎక్కడలేని సిగ్గు అతనినావరించేసింది. అతని నావరించింది "సిగ్గు"అని నిర్ణయించి చెప్పలేము. కాని ఒక్కటి మాత్రం నిజం మాధవరావుకేసి ఏమాత్రమూ చూడలేక పోయాడు. పురోహితుడు చెప్పినట్లు యంత్రంలా పనిచేసుకు పోతున్నాడు.

"అక్కాయేది?" అని మాధవరావునుద్దేశించి కమల మాట్లాడినమాటలు అతిభయంతో కేశవరావు చెవులలో ప్రవేశించినయ్. "వస్తున్నది" అన్న మాధవరావు సమాధానంకూడ వినగలిగాడు కేశవరావు. ఆమాటలు వినగానే ఎందుకో తన నంతవరకు బాధిస్తున్న అసూయ ఈర్ష్య మాయం కాజొచ్చినయ్.

మరిరెండు నిమిషాలలో సుజాత లోపలకు వచ్చింది. అంత మేళంమోతలో గూడ సుజాత గాజులచప్పుడు నిర్భయంగా కేశవరావు చెవినిబడ్డది సుజాతను చూడగనే, అంతవరకు కేశవరావులో ప్రజ్వరిల్లుతోన్న అగ్నిహోత్రం చల్లారిపోయింది

మళ్లా వెనుకటి తత్వం కేశవరావు నాక్రమిస్తోంది. ఎవరి ఇష్టమొచ్చినట్లు వాళ్ళను వదలేయాలి లోకులను లెక్కచేయకూడదు ఎవడేమనుకొంటే ఎవడిక్కావాలి? ఒకరిమీద మరొకరికి ఏమాత్రం అధికారంలేదు ఒకరిని మరొకరు శాసించటమనేది క్షమించరాని ఘోరపాపము. ఇవన్నీ మళ్లా కేశవరావు హృదయంలో ప్రవేశిస్తున్నయ్ కేశవరావుమాత్రం అదేపీటమీద పురోహితుడి చెప్పుచేతల్లో ఉన్నాడు- కమల మాధవరావులను చచ్చినాసరే సాధించాలనే పట్టుదల కేశవరావుకు దూరమైంది. ఒకసారి మాధవరావు కమలలకేసి చూశాడు వెంటనే అప్రయత్నంగా సుజాతకేసి కూడ చూశాడు. అంతవరకు అతనిలో చెలరేగిన అంతర్యుద్ధం తినుకోకుండానే అంతరానమైంది